
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★ బుధవారం 26 జూన్ 2024



గనుల వేలాన్ని రద్దు చేసేలా ఐక్య ఉద్యమాలు
8లో..

ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీ - ఇద్దరు మృతి
7లో..



ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ

- యథేచ్ఛగా టై, బెల్టులు, పుస్తకాలు, నోట్ బుక్కుల అమ్మకాలు
- విద్యా సంస్థల పేర్లు ముద్రించి దర్జాగా విక్రయం
- అడ్డగోలు ధరలతో తల్లిదండ్రుల బెంబేలు
- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు పెంచి దండుకుంటున్నాయి. అంతేగాకుండా టై, బెల్టులు, షూస్, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, స్టడీ మెటీరియల్‌ను విక్రయిస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల ఆవరణలోనే పుస్తకాలు, నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్‌ను విక్రయిస్తుండగా, మరికొన్ని పాఠశాలల యజమానులు పాఠశాలకు పక్కనే ఒక గదిని అద్దెకు తీసుకుని అందులో విక్రయిస్తున్నారు. ఆ షాపుల నిర్వహణకు మున్సిపాలిటీ నుంచి గానీ, గ్రామపంచాయతీల నుంచి గానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే దర్జాగా పుస్తకాలు, బుక్కులు విక్రయిస్తున్నారు. ప్రతి ఏటా వీటి పేరిట లక్షల రూపాయల జీరో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను పెద్దఎత్తున ఎగబెడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నోటు బుక్కులు, వర్క్‌బుక్కులు, స్టడీ మెటీరియల్స్ బుక్కులపై తమ విద్యా సంస్థల పేర్లు, చిత్రాలను ముద్రించి విక్రయిస్తున్నా కూడా విద్యా శాఖ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు కళ్లెదుటే అలాంటి బుక్కులు కనబడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాలల యాజమాన్యాలతో విద్యా శాఖాధికారులు కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల



పెద్దపల్లిలోని ఒక ప్రైవేట్ పాఠశాల పక్కన ఆ పాఠశాల పేరిట ముద్రించిన పుస్తకాల దుకాణం

నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 12 ప్రాథమిక, 50 ప్రాథమికోన్నత, 91 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో 44,153 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరి ఖని, రామగుండం, మంథని, సెంటినరీకాలనీ, ధర్మారం తదితర మండలాల్లో పేరు మోసిన పాఠశాలలు ఉన్నా యి. ఈ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబం. దనలను ఉల్లంఘిస్తున్నా

● దర్జాగా విద్యా సంస్థల పేరిట విక్రయాలు..

నిబంధనలకు విరుద్ధమని తెలిసినా కూడా నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్, వర్క్ బుక్స్‌పై తమ విద్యా సంస్థల పేర్లు, చిత్రాలను ముద్రించి మరి విక్రయిస్తున్నారు. ఎల్‌కేజీ చదివే విద్యార్థికి కావాల్సిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతరత్రా పుస్తకాలకు 3 వేల నుంచి 5 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇతర తరగతులు చదువుతున్న వారికి 5 వేల నుంచి 10 వేల రూపాయలు పుస్తకాల కొనుగోళ్లకే వెచ్చించాల్సి వస్తున్నది. విద్యా సంస్థలు సొంతంగా తమ పేరిట ముద్రించిన బుక్కులపై, స్టడీ మెటీరియల్స్‌పై అడ్డగోలు ధరలు ముద్రించి రూపాయి కూడా తగ్గించకుండా ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత విద్యా శాఖాధికారుల నిఘా కొరవడంతో యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతున్నది. ఈ వ్యవహారంపై కలెక్టర్ స్పందించి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్స్, వర్క్ బుక్కులు, ఇతరత్రా వస్తువుల పేరిట అడ్డగోలు ధరలకు విక్రయిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేట్ యాజామాన్యాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గత ఏడాది వరకు ఆయా పాఠశాలల్లోని ఆవరణలోనే బుక్‌స్టాల్స్ ఏర్పాటు చేయగా, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నాలు చేస్తుండడాన్ని గమనించిన యాజమాన్యాలు రూటుమార్చారు. పాఠశాలల పక్కనే ఒక గదిని అద్దెకు తీసుకుని అందులో పుస్తకాలు, నోట్‌బుక్కులు, ఇతరత్రా వస్తువులను విక్రయిస్తున్నారు. మున్సిపాలిటీలు గానీ, గ్రామ పంచాయతీల నుంచి గానీ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. షాపుల ముందు బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. విద్యార్థులకు మాత్రం ఫలానా చోట మాత్రమే పుస్తకాలు, నోట్‌బుక్కులు కొనుగోలు చేయాలని హుకుం జారీచేస్తున్నారు. తల్లిదండ్రులపై తడిసిమోపెడు భారం పడుతున్నది. తక్కువ ధరలకు బయట నోట్ బుక్కులు లభించే అవకాశాలు ఉన్నా కూడా కొనుగోలు చేసే అవకాశాలు లేవు. ఒకవేళ బయట కొనుగోలు చేసినా కూడా వాటిని అనుమతించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

- మాధవి, జిల్లా విద్యాశాఖాధికారి



ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులు, స్టడీ మెటీరియల్స్ విక్రయించడం నిబంధనలకు విరుద్ధం. వాటిపై పాఠశాలల పేర్లను ముద్రించడం నేరమే. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బుక్‌స్టాల్స్ గురించి ఆయా శాఖల అధికారులకు నివేదిస్తాం. ఎక్కడైనా పాఠశాలల్లో పుస్తకాలు, నోటుబుక్కులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరిన పెద్దపల్లి ఎమ్మెల్యే
- మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలతో కలిసి వినతి పత్రం



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు భూములను స్థిరీకరించేందుకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌లతో కలిసి మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ప్రధానంగా డి-83, డి-86 కాలువల ద్వారా 2,20,000 ఎకరాల ఆయకట్టు ఉందని అదేవిధంగా చివరి ఆయకట్టు వరకు ప్రస్తుతం విడుదల చేస్తున్న నీరు తగినంతగా అందడం లేదని తెలిపారు. దీంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని, సాగు విస్తీర్ణం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని పత్తిపాక రిజర్వాయర్‌కు తరలించి అక్కడి నుంచి జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టుకు పంపించేందుకు సులువుగా ఉంటుందన్నారు. ధర్మారం మండలం పత్తిపాక గ్రామశివారులో రిజర్వాయర్ నిర్మాణానికి అనుకూలంగా ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయన్నారు. 5 నుంచి 10 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తే ఈ ప్రాంత రైతుల చిరకాల కోరిక నెరవేరనున్నదన్నారు. పత్తిపాక రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలని కోరానని, మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని విజయరమణారావు పేర్కొన్నారు.

రామగుండంలో 800మెగావాట్ల పవర్‌ప్లాంట్ నిర్మించండి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వినతి



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 25: రామగుండంలో 62.5 జెన్‌కో విద్యుత్ కేంద్రం స్థానంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్‌కేంద్రాన్ని నెలకొల్పాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వినతిపత్రం అందజేశారు. ఈమేరకు మంగళవారం మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే వినతి పత్రంఅందజేశారు. ఈ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇది పిట్ హెడ్ స్టేషన్ అని, బొగ్గు, నీరు, భూమి అందుబాటులో ఉన్నాయన్నారు. రాబోయే వందేళ్ల వరకు బొగ్గు నిల్వలు ఉన్నాయని, వెంటనే విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించి భట్టి విక్రమార్క త్వరలోనే రామగుండంలో విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు విజయరమణరావు, ప్రేమ్‌సాగర్‌రావు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బుక్స్ అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి టౌన్, జూన్ 25: నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల పేరిట ముద్రించిన నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్, వర్క్‌బుక్కులను అమ్ముతూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ రోడ్‌లోని ఒక విద్యా సంస్థ పక్కనేగల గోదాంలో ఆ సంస్థ పేరిట ముద్రించిన బుక్కుల అమ్మకాలను ఎస్ఎఫ్‌సీ నాయకులు గుర్తించారు. అడ్డగోలు ధరలకు నోట్‌బుక్కులు, వర్క్‌బుక్కులు, ఇతర పుస్తకాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాసంస్థల పేర్లు బుక్స్‌పై ప్రింట్ చేసి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారని అన్నారు. ఈ విషయమై డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈవో, ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్కయిస్తున్న పుస్తకాలు, బుక్కులను సీజ్ చేసి ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధార్థ, నవీన్, రోషన్, నితిన్, ధరన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అంగన్‌వాడీల అభివృద్ధి

- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ

పెద్దపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అంగన్ వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. గత 5నుంచి 6సంవత్సరాలుగా పిల్లల సంక్షేమం కోసం కృషి చేసిన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్దం చేశామని, అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్‌లెట్ రూపొందించామని, జూలై మొదటివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తిచేయాలని కలెక్టర్‌లకు ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సివిల్‌వర్క్స్ కోసం మంజూరు చేసిన నిధులతో తాగు నీరు, టాయిలెట్ల పనులు, విద్యుత్ మరమ్మత్తు మొదలగు పనులు పూర్తిచేయాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్ వాడీ శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష - ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

సుల్తానాబాద్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం మండలంలోని ఐతరాజ్‌పల్లి, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, పూసాల తదితర గ్రామాలతో పాటు సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. పలు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న చివరి దశ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాప్రమాణాన్ని పరిశీలించారు. పలు అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.



అమ్మ ఆదర్శ పాఠశాలలో పనుల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్

పెండింగ్ ధరణి దరఖాస్తుల పై సమీక్ష

సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులపై ఆరాతీశారు. దరఖాస్తులను రెండు రోజులలో పూర్తి చేయాలన్నారు. మండలంలో భూసర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ దరఖాస్తుదారునికి వారం రోజులలోపు పూర్తి చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి ఆర్డీవో లింగయ్య, తహసీల్దార్ మదుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేదలు మధ్య తరగతి ప్రజానీకం వస్తారని,వారికి నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. సులానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను తనిఖీ చేశారు. అలాగే గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. పలు సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, సుల్తానాబాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, ఆర్‌ఎంవో డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీధర్ తదితరలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 25: డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పించాని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కునారం గేటువద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి సందర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, కూనారం రోడ్డు వద్దగల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, చివరి దశ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డబల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్ద లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతుల పనులు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ సంప్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి మున్సిపల్ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ తహసీల్దారు ను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయానికి తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్ లైన్ వేయాలని, ఈ పనుల ప్రతిపాదనలు రూపొందించి వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 27: సింగరేణి కింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సింగరేణి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పెండింగ్ భూ సేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సర్వేయర్లను ఆదేశించారు. ఆర్డీ-1 పరిధిలో ఉన్న సింగిరెడ్డిపల్లి, ఆర్డీ 2 పరిధిలో ఉన్న పెద్దంపేట, ఆర్డీ 3 పరిధిలో ఉన్న బుధవారం పేట రత్నాపూర్, తుర్కపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూసేకరణ, ఆర్‌ఆర్ స్థితిగతులపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు జి. సునీత, సింగరేణి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీలో అందరూ పాల్గొనాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 25: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించు అవగాహన ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ర్యాలీలో, సమావేశంలో అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

27లోగా సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి : డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, జూన్ 25: స్టాఫ్ నర్సుల పోస్టులకు సర్వీస్ సర్టిఫికెట్ ఈనెల 27 లోగా సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిపై 25 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి గతంలో 2024 ఫిబ్రవరి 27న ఇవ్వబడిన నోటిఫికేషన్ ఆధారంగా అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కలెక్టర్‌లు జారీచేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం స్టాఫ్ నర్స్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసిన వారిలో ఎవరైనా గతంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపాదికన ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్న తరుణంలో రెగ్యులర్ స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకం ద్వారా నియమించబడిన అభ్యర్థుల వలన ఎవరైనా అభ్యర్థులను విధుల నుంచి తొలగించబడి ఉంటే, వారు తమ నియామక పత్రం, తొలగించబడిన ఉత్తర్వుల పత్రం, సంబంధిత అధికారితో ధ్రువీకరించి సర్వీస్ సర్టిఫికేట్‌లను 27లోగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, పెద్దపల్లి కార్యాలయంలో సమర్పించాలని డాక్టర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు.



కంకర వేశారు... తారు మరిచారు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


కంకర వేసి వదిలివేసిన ఎరడపల్లి-గంగిపల్లి రహదారి

శంకరపట్నం, జూన్ 25: శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామం నుంచి మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి తారు మరిచారు. గ్రామాల రోడ్డును జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023లో పనులు ప్రారంభించారు. మొదటి విడత నిధులతో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. అందులో భాగంగా ఎరడపల్లి నుంచి గంగిపల్లి వరకు కంకర వేసి పనులు నిలిపివేశారు. ఈ దారి గుండా మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు, వీణవంక మండలంలోని పలు గ్రామాలకు పదుల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు జరుపుతుంటాయి. సంవత్సర కాలంగా కంకర రోడ్డుపై ప్రయాణించిన పలువురు వాహనదారులు వాహనాలపై నుంచి పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దళిత కాలనీలో వెలగని వీధి దీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగాధర, జూన్ 25: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి దళిత కాలనీలో ఇరవై రోజులుగా వీది దీపాలు వెలగడం లేదు. గ్రామాధికారికి, విద్యుత్ అధికారులకు పిర్యాధు చేసిన మాదికాంంటే మాదికాదంటు తప్పించుకుంటున్న అధికారులు. గత ఇరవై రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగు పాటడంతో దళిత కాలనీలోని వీధి దీపాలు వైర్లతో పాటు బల్బులు కిందపడ్డయి. గ్రామపంచాయతీ సిబ్బంది పది రోజులుగా తిరుగుతున్న సమస్య గుర్తించలేకపోయారు.గ్రామసిబ్బంది కేవలం వీది దీపాలు పోతే తొర్పడం తప్ప కరెంటు సమస్య తెలువదని వాపోతున్నారు. ఇన్సులేటర్లు పలిగి లేదా వైర్లు ఎక్కడైన అల్లుకుని ఈవిధమైన సమస్య వస్తుందని గ్రామ పంచాయతీ హెల్పర్ అంటున్నారు. వారం రోజులు క్రితం ఈ సమస్యనుతెలిపిన విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. దళిత కాలనీలో వీది దీపాల కనెక్షన్ పునరుద్ధరణ చేస్తే వీది దీపాలు ఎక్కడెక్కడ పోయాయో అమర్చుతామని సిబ్బంది తెలుపుతున్నారు.గత కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక కుక్కల, విషపురుగుల బెడదతో కాలనీవాసులు బయటికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీది దీపాలు లేక దొంగల భయం పట్టుకుందని అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను గుర్తించి సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


భోజనశాలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూన్, 25: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురుల పాఠశాల, మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు, విద్యబోధన, భోజనం, హాస్టల్ వసతులను, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని, హాస్టల్ సదుపాయాలు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఉన్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి, అక్కడ చదువుతున్న వారితో కాసేపు మాట్లాడి అవసరమైన పుస్తకాలు ఉన్నయాని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు, ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రంథాలయం చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రంథాలయంకు ఎమైనా అవసరాలు ఉంటే దృష్టి తీసుకరావాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆరేళ్ల రాజాగౌడ్, పాలేపు రాజాగంగారం, నాయకులు ఉన్నారు.

అంగడిలో అడ్డగోలు వసూళ్లపై విచారణ ఏది..?

● రసీదు బుక్‌లపై ఆరా తీసిన కమిషనర్


జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట, జూన్ 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పశువుల అంగడిలో అడ్డగోలు వసూళ్లపై ఆంధ్రజ్యోతి అనుబంధంలో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందె. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. అంగడి ప్రారంభమై మూడు నెలలు కావస్తుంది, పూర్తి అయిన రశీద్ బుక్‌లు ఎందుకు వెనక్కి తీసుకోలేదు, పశువుల క్రయ విక్రయదారుల వద్ద గుత్తేదారు ఎంత వసూళ్లు చేస్తున్నారు, ఎప్పటికప్పుడు తనిఖీలు ఎందుకు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంగళవారం అంగడి ఉండటంతో మొదట విచారణ చేపట్టాలని బావించినట్లు తెలుస్తోంది. కానీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు అంగడి వద్దకు వెళ్లేందుకు సాహసం చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అమాయకులైన క్రయ విక్రయదాలరులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది.

29న సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 25: జిల్లా ఆసుపత్రిలో జూలై, ఆగస్టు నెలలో నిర్వహించే సదరం శిబిరంలో పాల్గొనేందుకు ఈ నెల 29న 11.30 నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3న ఆర్థో, జూలై 9న మానసిక, 15న కంటి చూపు, 23న వినికిడి, మూగ వారికి సంబంధించిన సదరం శిబిరం నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 6న ఆర్థో, 13న మానసిక, 20న కంటి చూపు, 27న వినికిడి, మూగ వారికి సంబంధించిన వారికి శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత వైద్య పత్రాలు, మీసేవలో బుక్ చేసుకున్న రశీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో సదరం శిబిరానికి హజరు కావాలని సూచించారు.

29న కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 25: ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ ఈ నెల 29న కొండగట్టుకు రానున్నట్లు తెలిసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించిన నూతన వాహనం వారాహికి పూజలు నిర్వహించారు. అటు తరువాతే ఏపీలో ప్రచారం మొదలు పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేసిన వాటిలో మొత్తం గెలుపొందడంతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి వచ్చి పవన్‌కల్యాణ్ పూజలు నిర్వహిస్తారని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవణ్‌కళ్యాన్ కొండగట్టుకు రానున్నట్లు సమాచారం రావడంతో పవన్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

ఆర్టీసీ బస్సు.. బొలెరో వాహనం ఢీ

● బొలెరో ప్రయాణిస్తున్న ఇద్దరి మృతి ● బస్సులోని ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

ధర్మారం, జూన్ 25: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ అన్వర్ పాషా(25), మరొక వ్యక్తి అబ్బల్(55) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల డిపోకు చెందిన ఏపీ29జడ్ 2622 ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా, ఏపీ 28టిఎ8726 బొలెరో వాహనం ఎదురుగా వస్తూ ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ అన్వర్(25), అబ్బల్(55) అనే ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్‌ది హైదరాబాద్ పరిధి ముషీరాబాద్‌లోని ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి. అబ్బల్ గోదావరిఖనిలోని లక్ష్మీనగర్‌కు చెందిన వ్యక్తి అని గుర్తించారు. బొలెరో వాహనంలో ఇద్దరి మృతదేహాలు ఇరుక్కుని ఉండడంతో గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉమాదేవి, ఆగవ్వ అనే మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ చేరుకుని ఘటన వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కరీంనగర్ తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.



ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఢీకొన్న బొలెరో, ఆర్టీసీ బస్సు

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించండి

● రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు గర్షకుర్తి చేనేత సంఘం నాయకుల వినతి

గంగాధర, జూన్ 25: బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని గర్షకుర్తి చేనేత సంఘం నాయకులు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల తరువాత మినీ సిరిసిల్లగా పేరున్న గర్షకుర్తిలో మరమగ్గాలు, చేనేత రంగంపై అనేక మంది కార్మిక కుటుంబాలు ఆధారపడ్డాయని కొన్ని సంవత్సరాలుగా ఉపాధి పొందుతూ జీవనం గడుపుతున్నారన్నారు. ఆరు నెలలుగా పనిలేక ఇతర పనులు చేయలేక కుటుంబాలు గడ్డుకాలం వెల్లదీస్తున్నాయన్నారు. గర్షకుర్తి చేనేత మరమగ్గాలకు బతుకమ్మ ఆర్డర్లు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు అలువాల విరోభ, అన్నల్ దాస్ శ్రీనివాస్, గుండ రాజేశం, వెంకటాద్రి, అలువాల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూన్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరగా అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంజన్న దర్శనం అనంతరం భక్తులు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతా లు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

అవమానభారంతో మహిళ ఆత్మహత్య

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మోతె అఖిల (31) అనే మహిళకు వివాహేతర సంబంధం అంటగట్టి దాడి చేయడంతో అవమానంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై రెండురోజుల క్రితం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మృతురాలి బంధువులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేశారు. మృతురాలి భర్త జలేందర్ తెలిపిన ప్రకారం..ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య ఉమ, తిరుమల, రాజ్‌కుమార్‌లు తన భార్యకు అక్రమ సంబంధం అంటగట్టడంతో తన భార్య అఖిల ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదన్నారు. తాము వ్యవసాయ బావులన్నీ వెతుకగా రాజిరెడ్డి బావిలో అఖిల మృతదేహం లభించిందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా అవమానించిన వ్యక్తులకే పోలీసులు వత్తాసు పలుకుండడంతో ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేయాలన్నారు. ఈ సంఘటపై అఖిల భర్త జలేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



బైరి సతీష్(ఫైల్)

కోల్‌సిటీ, జూన్ 25: గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే బైరి సతీష్(32) అనే వ్యక్తి భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సతీష్ ప్రైవేట్ ఉద్యోగి. 2020లో అతనికి హారి కతో వివాహం జరుగగా మూడు సంవత్సరాల కూతురు ఉంది. భార్యభర్తల మధ్య వివాదాలతో విడాకులకు కోర్టును ఆశ్రయించారు. తన భార్య తిరిగి కాపురానికి వస్తానని చెప్పి, మళ్లీ తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో ఈ నెల 2న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 25: మండలంలోని సిరికొండలో మంగళవారం ఫిరదౌస్ (26) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన ఫిరదౌస్ కొన్నేళ్ల కిందట సిరికొండకు ఇల్లరికం వచ్చాడు. భార్య ఫిరదౌసీతో కొద్ది రోజులుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. గొడవలు జరుగుతున్న క్రమంలో వారం రోజుల కిందట ఫిరదౌస్ రాయికల్ వెళ్లాడు. సిరికొండ-కోరుట్ల రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో ఫిరదౌస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి బాషామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపినట్టు తెలిపారు. కాగా పోలీసులు తనను వేధించారని ఫిరదౌస్ తన బంధువులకు వాట్సాప్ సందేశం పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

రాయికల్, జూన్ 25: రాయికల్ పట్టణంలో రెండు రోజుల క్రితం 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన సింగు గంగనర్సయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తుంటాడు. తన షాపునకు బాలికను పిలిచి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపామని చెప్పారు. ఇప్పటివరకు నిందితుడు పరారీలో ఉండగా, మంగళవారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసి బస్సుకు బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

పాలకుర్తి,జూన్ 25: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం అడ్డరోడ్డు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సుకు బైకు ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, అందుగులపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హరీష్ కుర్మపల్లి వైపు వస్తుండగా ఢీకొన్నట్లు తెలిసింది.

పాత కక్షలతో హత్య

● ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, జూన్ 25: పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపేట గ్రామానికి చెందిన ధనరేకుల రాజేందర్‌కు అదే గ్రామానికి చెందిన జెల్ల రమేష్, జెల్ల మహేష్‌లకు మధ్య పాత కక్షలతో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఏలాగైనా రాజేందర్‌ను హత్య చేయాలని రమేష్, మహేష్‌లు 2020 మే 19న గ్రామ సమీపంలో కత్తులతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య హరిణి మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవి కుమార్, ఎస్సై సధాకర్ కేసు నమోదు చేశారు. నిందితులైన రమేష్, మహేష్‌లను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు రాజు నాయక్, కిరణ్ కుమార్, రంజిత్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు అయిన రమేష్, మహేష్‌లకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

రామగిరి, జూన్ 25: రామగిరి మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన వి. శ్రీలక్ష్మి(46) మంగళవారం టాయిలెట్ క్లీనర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం టాయిలెట్ క్లీనర్ తాగి అపస్మాకర స్థితిలో ఉన్న శ్రీలక్ష్మిని కుటుంబ సభ్యులు గుర్తించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. శ్రీలక్ష్మి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పత్తి ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 25: మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (27) మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై పైడిమడుగు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పైడిమడుగు గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నట్లు తెలిపారు. తీవ్ర గాయాల పాలైన ప్రశాంత్‌ను గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు బంధువులకు తెలిపారు. వెంటనే బంధవులు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిది వాహనాలను సీజ్ చేసిన ఎంవీఐ

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు సమీపంలో మంగళవారం ఎంవీఐ వేణు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధిక లోడ్, సరైన పత్రాలు లేకపోవడంతో తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు పత్రాలు లేకుండా రోడ్లపైకి రావద్దన్నారు. అధిక మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ నిబంధన లు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మల్యాల, జూన్ 25: మల్యాలకు చెందిన పెరుమల్ల సుమన్‌గౌడ్ అనే గీతకార్మికుడు ప్రమాదవశత్తూ తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా అదుపుతప్పడంతో కింద పడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

విభజన హామీల అమలుకు బీజేపీ ఎంపీలు కృషి చేయాలి

భగత్‌నగర్ (కరీంనగర్), జూన్ 25: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో యూపీఏ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. బయ్యారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ లాంటి హామీలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓట్లు కొన్నిచోట్ల బీజేపీకి ట్రాన్స్‌ఫర్ అవడం వల్లనే ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డి విభజన హామీల అమలుకు కేంద్రపై ధైర్యంగా పోరాడాలన్నారు.సింగరేణిని ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నేత కార్మికుడి ఆత్మహత్య



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 25: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన ముదికొండ నరేష్ (34) అనే నేత కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన నరేష్ గతలంలో వైపని కార్మికుడిగా పనిచేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పని బంద్ చేసి జులాయిగా తిరిగేవాడు. గతంలోనూ మద్యం మత్తులో చేతి నరాలను బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన నరేశ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● మృతుడు నరేష్ కుటుంబాన్ని జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, కోడి అంతయ్య, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, తాటికొండ చందు తదితరులు పరామర్శించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. రూ. 5 వేలు, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు గడ్డం మధుకర్, శ్రీరాం నరేష్, కొంపెల్లి శ్యామ్, బల్ల లక్ష్మిపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



నరేష్ కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

డీఈఈ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్25: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశాలల్లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరములో 2024-25 విద్యా సంవత్సరంలో చేరుటకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైయినట్లు మండలంలోని ఎల్ఎండిలో గల డైట్ ప్రిన్సిపల్ శ్రీ రాంమొండయ్య తెలిపారు. ఈ కోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు1, 2024 నాటికి 17 సంవత్సరాలు ఉండాలని, గరిష్ఠ వయో పరిమితి లేదని తెలిపారు.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని గడువు తేదీ సమీపి స్తున్నందున చివరి వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష 10.7.2024న ఉంటుందని, డీఈఎల్ఈడి కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుదని, డిపిఎస్ఈ మాత్రమే ఆంగ్ల మాధ్యంలో ఉంటుందని అన్నారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయాలనుకుంటే ఆ మాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష రాయాలన్నారు. వివరాలకు డిఈఈసెట్-2024 వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 25: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 167క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,350, కనిష్ఠ ధర రూ.6,900 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డీబార్

గణేశ్‌నగర్ జూన్ 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.రష్మిధర్ తేజ డిగ్రీ కళాశాల, కోరుట్లలో- ఒకరు, సంగమిత్ర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, హుస్నాబాద్‌లో- ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో- ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లో- ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల, జమ్మికుంటలో- ఒకరు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో - ఒకరు. మొత్తం 9 మంది డీబార్ అయినట్లు తెలిపారు.

6న ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూన్ 25 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న ఎల్ఎల్‌బి ఆరవ సెమిస్టర్ పరీక్షలు జూలై ఆరవ తేదీ నుంచి పదో తేదీ వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు.

5జీ సిగ్నల్ రేడియేషన్‌పై అవగాహన ఉండాలి

● ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్



ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, జూన్ 25: 5జీ సిగ్నల్ రేడియేషన్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐఈఎస్ డైరెక్టర్ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఈఎంఎఫ్ రేడియేషన్ అవేర్‌నెస్ 5జీ, డాట్ (డీవోటీ)స్కీంల గురించి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఈఎస్ డైరెక్టర్ సైబర్ సెక్యూరిటీ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్‌కుమార్ టెలీగ్రాం సర్వీస్ ప్రోవైడర్ జి. రాఘవరెడ్డి, వి. రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మూడేళ్లలో తెలంగాణలో దొంగతనానికి గురైన మొబైల్స్ నుంచి 40 వేల మొబైళ్లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై 32 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 25: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసులో చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కొంకటి లక్ష్మణ్‌కు కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా తెలిపారు. లక్ష్మణ్ 2019లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో జరిమానా చెల్లించాడన్నారు. మళ్లీ 2021లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ విజిలెన్స్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ ఎదుట హాజరుపరచగా 52,944 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

నా కొడుకును నాకు అప్పగించండి

● ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తండ్రి

కరీంనగర్ క్రైం, జూన్ 25: తెలంగాణకు చెందిన ఓ బాలుడు బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయాడు. తన కొడుకును తనకు అప్పగించాలని తెలంగాణకు చెందిన ఆ బాలుడి తండ్రి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. బాధితుడు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి 2016లో ఉపాధి కోసం ముంబైకి వెళ్లి అక్కడ మీరా రోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. అతనికి అక్కడే రియా అనే బంగ్లాదేశ్ అమ్మాయి పరిచయమైంది. కొంతకాలానికి వారు పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ కూడా ఇది రెండో వివాహం. గతంలో వారు పెళ్లిళ్ల అయి విడాకులు తీసుకున్నారు. వీరి ద్దరూ రెండో పెళ్లి చేసుకున్నాక 2017లో విశాల్ అనే కుమారుడు జన్మించాడు. కొంతకాలం తర్వాత రియా మరో అబ్బాయితో ప్రేమలో పడి అతనితో వేరే కాపురం పెట్టింది. దీంతో రియాకు, తిరుపతికి విడాకులు అయ్యాయి. వీరికి పుట్టిన బాబు రియా దగ్గరే ఉన్నాడు. మూడో భర్త తమ కుమారుడిని కొడుతున్నాడని బ్లాకమె యిల్ చేసి పలుసార్లు తిరుపతిని డబ్బులు అడిగింది. చివరికి బాబు తనకు వద్దంటూ తిరుపతికి ఇచ్చేసింది. బాబును తీసుకొని తిరుపతి ముంబై నుంచి తెలంగాణకు వచ్చి మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. విడాకులు తీసుకున్నప్పటికీ రియా.. తిరుపతితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంది. బాబును చూడాలని ఉందన రియా చెప్పడంతో నమ్మిన తిరుపతి బాబును తీసుకుని ముంబై వెళ్లాడు. అక్కడ తిరుపతిపై దాడి చేసి బాబును తీసుకుని రియా బంగ్లాదేశ్ వెళ్లింది. ముంబైలో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత బంగ్లాదేశ్ నుంచి రియా బంధువులు తిరుపతికి వాట్సప్‌లో విశాల్‌ను హింసలు పెడుతూ తీసిన ఫొటోలు, వీడియోలు పంపిస్తూ డబ్బులు అడగడం ప్రారంభించారు. డబ్బులు పంపిస్తే బాబును పంపిస్తామంటున్నారు. దీంతో తిరుపతి ఇటీవల కరీంనగర్‌కు వచ్చి తన కుమారుడిని తనకు అప్పగించాలని కేంద్ర సహాయ హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించాడు. మళ్లీ బండి సంజయ్‌ని కలిసేందుకు మంగళవారం తిరుపతి కరంనగర్‌కు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి తన గోడును వినిపించాడు.



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న తిరుపతి(ఫైల్)



విశాల్

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల గడువు ఈ నెల 27తో తీరిపోతున్నా వాటిని పంపిణీ చేయనివ్వడం లేదని.. వాటిని పంపిణీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికే జారీ అయిన చెక్కులను పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీ ఎలాంటి జాప్యం లేదని.. ఒకవేళ చెక్కుల గడువు తీరిపోయినా ప్రభుత్వం మళ్లీ జారీ చేస్తుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ నెల 27 నాటికి చెక్కుల కాలపరిమితి తీరిపోయే పక్షంలో పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఆదేశాలిస్తామని.. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలు

మంథని, జూన్ 25: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ అవరణ భక్తులతో సందడి గా మారింది.

ఆసరా ఫించన్‌లను విడుదల చేయాలి

కమాన్‌పూర్, జూన్ 25 : వృద్ధులకు, వికలాంగులకు, వితంతు, గీత, చేనేత కార్మికులకు ప్రతి నెల ఇవ్వాల్సిన ఆసరా ఫించన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్‌గౌడ్, తాటికొండ శంకర్, నీలం శ్రీనివాస్,తోట రాజ్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి

రామగిరి, జూన్ 25: మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన అక్రమ లే-అవుట్‌ల రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలని కోరుతూ ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఆధ్వర్యంలో పెద్దఎత్తున గ్రామస్తులు కలెక్టర్ శ్రీహర్షకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న వెంచర్‌కు రిజిస్ట్రేన్‌ల నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా వినతిలో పేర్కోన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి,జూన్ 25: రాబోయే వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపిడీవో పోల్సాని శశికళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మండలం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు,హెల్త్ సూపర్‌వైజర్స్ ఏఎన్ఎంలు,ఎంపీవో షబ్బీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో సమగ్ర పర్వే ప్రారంభం

పాలకుర్తి,జూన్ 25: మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పనులపై సమగ్రసర్వే ప్రారంభమైంది. మంగళవారం రాత్రి జయ్యారం గ్రామంలో సోషల్ ఆడిట్ కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఉపాధి కూలీల జాబ్‌కార్డులు, వారికి వస్తున్న కూలి డబ్బులు, పని స్థలాల్లో ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎస్ఆర్‌పి మహేష్, డీఆర్పిలు వంశీ, కవిత, రాహుల్‌తో పాటు 20 మంది సభ్యులు ఒక టీమ్‌గా సర్వే నిర్వహిస్తున్నారు. వీరు సేకరించిన సర్వే రిపోర్టును జులై 1న మండల సాముహిక సభలో అందించనున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దపల్లి రూరల్, జూన్ 25 : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు సమయానికి హజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కాలం చెల్లిన బాలామృతం

కళ్యాణ్‌నగర్, జూన్ 25: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇస్తున్న బాలామృతం కాలం చెల్లినవి ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిఖని పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పంపిణీ చేసిన బాలామృతం కాలం చెల్లినవి ఉండడంతో తల్లిదండ్రులు ఈ విషయమై టీచర్లకు ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలపై పోలీస్ కళా బృందం ప్రదర్శన

అంతర్గాం, జూన్ 25: మండల పరిధిలోని ఎల్లంపల్లిలో మంగళవారం మహిళ రక్షణ, గంజాయి వాడకం, సైబర్ నేరాలపై పోలీస్ కళా బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం సీఐ అజయ్ బాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్‌లకు సహకరించాలని కోరారు. ఎస్ఐ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది, బృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి...

కళ్యాణ్‌నగర్, జూన్ 25: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజారెడ్డి అన్నారు. శారదానగర్ లయన్స్‌క్లబ్ భవన్‌లో సోమారపు లావణ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకారం క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. లక్ష్మీవాణి, మంజుల, వర లక్ష్మి, కోదండరాం పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

పెద్దపల్లి రూరల్, జూన్ 25: మండలంలోని చీకురాయికి చెందిన ఏగోలపు కోమురయ్య గౌడ్ ప్రమాదవశాత్తు సోమవారం రాత్రి తాటిచెట్టు ఎక్కే క్రమంలో మోకు జారీ కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైనా చికిత్స కరీంనగర్ రిఫర్ చేశారు. భాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గీత కార్మికులు కోరారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, జూన్ 25: రోడ్డు ప్రమాదానికి గురైన ఫొటోగ్రాఫర్ వేల్పుల ప్రదీప్‌కు ఖని, జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం అందించింది. మంగళవారం స్థానిక విఠల్‌నగర్‌లోని ప్రదీప్ ఇంట్లో ప్రధానకార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్‌లు రూ.10వేల చెక్కును అందజేశారు.

ప్రజా ప్రయోజనాలు గాలికి.. కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యం..

- వివాదాల్లో రామగుండం ఇంజనీరింగ్ విభాగం - విజిలెన్స్ విచారణలు జరుగుతున్నా ఫలితం శూన్యం



నాలాపై వంతెనను కూల్చివేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ, జూన్ 25: రామగుండం నగరపాలక సంస్థలో ప్రజల సౌకర్యం కన్నా కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే యంత్రాంగం ప్రాధాన్యతనిస్తుందనే విమర్శలు పెరుగుతున్నాయి. ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన ఇంజనీరింగ్ విభాగంలో ఎవరికి వారే అనే రీతిలో వ్యవహారాలు సాగుతున్నాయి. అంచనాలకు పనులకు పొంతన లేకపోవడం, చేసిన పనికి, రికార్డులకు భారీగా తేడాలు ఉంటున్నాయి. రోడ్లపై మ్యాన్ హోల్స్ తెరుచుకుంటే నెలల తరబడి పట్టించుకునేవారు లేరు. డ్రైనేజీ, సీసీరోడ్లు, మంచినీటి పైప్ లైన్లు ఇలా ఒకటి రెండు కాదు ఇంజనీరింగ్ విభాగం చర్యలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణకన్నా కాంట్రాక్టర్ల కనుసన్నల్లోనే ఈ విభాగం పనితీరు ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నాణ్యతతో ఉన్న బ్రిడ్జి కూలగొట్టారు..

రామగుండం నగరపాలక సంస్థ 6వ డివిజన్ నుంచి 5వ డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు, కాలనీలకు వెళ్లే రహదారిలో గతంలో సీసీ పిల్లర్లతో నాలాపై వంతెన ఉండేది. పాఠశాలలు, కళాశాలలకు ప్రధానమైన మార్గం బురదమయం అవుతుందని, రోడ్డు మంజూరు చేయాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించారు. నగరపాలక సంస్థ రూ.50లక్షల పట్టణ ప్రగతి నిధులతో నాలావద్ద వంతెన, సీసీ రోడ్ల నిర్మాణానికి పనులు అప్పగించింది. వాస్తవానికి గతంలో మున్సిపల్ నిర్మించిన వంతెన ఒక్క అడుగు మందంతో నాణ్యతోనే ఉంది. భారీ వరదలను కూడా తట్టుకుంది. దీనిని కొత్త వంతెన నిర్మిస్తామంటూ ఆరు నెలల క్రితం ధ్వంసం చేశారు. ఇంతవరకు రాడ్ కానీ, మెటీరియల్ కానీ కార్పొరేషన్‌లో అప్పగించలేదు. మాకు తెలియకుండానే కాంట్రాక్టర్ వంతెన ధ్వంసం చేశాడంటూ అధికారులు పేర్కొన్నారు. తరువాత ఏమైందో ఏమో కానీ సీసీ రోడ్ల నిర్మాణం జరిగిపోయింది. వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఎండాకాలంలో నిర్మాణం చేస్తామంటూ పేర్కొన్న అధికారులు వర్షాకాలం వచ్చే వరకు కూడా ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటి వరకు ఉన్న వంతెన కూల్చివేయడం, కొత్త వంతెన నిర్మించకపోవడంతో ఆ ప్రాంతానికి వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల తప్పిదాలకు ప్రజలు అవస్థలు పడుతున్న పరిస్థితి.

నోళ్లు తెరిచిన మ్యాన్ హోల్స్..

రామగుండం నగర పాలక సంస్థలోని వివిధ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ కవర్స్ లేక నోరు తెరుచుకుంటున్నాయి. పాదచారులు, వాహనదారులు ప్రజలకు గురవుతున్నారు. వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లోని పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్‌పై కవర్ లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అడ్డగుంటపల్లి, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి. మున్సిపల్ కార్పొరేషన్ మాత్రం గతంలో మ్యాన్ హోల్స్ కవర్స్‌కు రూ.10 లక్షలతో తెప్పించినట్టు రికార్డులు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం మ్యాన్ హోల్స్ కవర్లు పగిలిపోతే మెయింటనెన్స్ పనుల్లో భాగంగా మ్యాన్ హోల్స్ మరమ్మతు చేసి మార్చాల్సి ఉంటుంది. ఈ మేరకు లాగ్‌బుక్‌లు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. మ్యాన్ హోల్స్ కవర్స్ తెప్పించి శారదానగర్ ట్యాంకు ఆవరణలో పెట్టినట్టు చెబుతున్నారు. కానీ అవి ఎక్కడ వేశారో, అవసరం ఉన్నకాడ ఎందుకు వేయలేక పోతున్నారో స్పష్టతలేనిపరిస్థితి.

రికార్డుల్లో అప్పగింతలు..

రామగుండం నగర పాలక సంస్థలో పారిశుధ్య వాహనాల కొనుగోళ్లలో భారీ గోల్‌మాల్ జరిగింది. రూ.8కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ వాహనాలు రాకుండానే బిల్లులు చెల్లించడం, అప్పటి ప్రభుత్వ ఉన్నతాధికారులు, నాయకుల పేర్లు చెప్పి ఓచర్ బిల్లులపై కోట్ల రూపాయలు చెల్లించారు. ఎలాంటి రికార్డు లేకుండానే బిల్లులు చెల్లించారు. ఈ గోల్‌మాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో బిల్లులు చెల్లించిన రెండేళ్ల తరువాత ఒక్కొక్కటిగా వాహనాలు కార్పొరేషన్‌కు వచ్చాయి. కార్పొరేషన్‌లోని స్కైలిఫ్టర్‌ను ఇప్పటికీ కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ చేయించలేదు. రూ.70లక్షలతో కొనుగోలు చేసిన కాంపాక్టర్ నాలుగు రోజులు కూడా పని చేయని పరిస్థితి. జెట్టింగ్ మిషన్ రెండున్నరేళ్లుగా మూలకు పడిఉంది. స్వీపింగ్ మిషన్‌ది అదే పరిస్థితి. కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన వాహనాలు స్వాధీనం చేసుకునే సమయంలో పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ చూసుకోకుండా ఇంజనీర్లు రికార్డుల్లో సంత కాలు పెట్టడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

రామగుండం నగరపాలక సంస్థలో ఆదాయ మార్గాల పెంపు విషయంలో కానీ, అవినీతి విషయంలో కానీ కమిషనర్ మొదలు అదనపు కలెక్టర్ వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షించ లేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. రూ.3కోట్ల ఆదాయం రావాల్సిన ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేదు. రైస్ మిల్లులు, ఫంక్షన్‌హాల్స్, వైన్స్‌లలో వసూలు చేయలేదు. ఈ విషయంపై విమర్శలు రావడంతో ఇప్పుడిప్పుడే కదలిక మొదలైంది. మూడు నాలుగు టీములకు ఈ పనులు అప్పగించాల్సి ఉండగా కేవలం ఒక టీమ్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. ఇంజనీరింగ్‌లో అవినీతి జరుగుతుందంటూ ఆరోపణలు వస్తున్నా దానిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టిన పరిస్థితి లేదు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

-జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి



మాట్లాడుతున్న ఆదిరెడ్డి

సుల్తానాబాద్, జూన్ 25: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి రైతు వేదికలో జిల్లాలోని సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండల వ్యవసాయాధికారులు, ఏఈఓలతో జిల్లా వ్యవసాధికారి సమావేశం నిర్వహించారు. ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు కూడా ఇందులో పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా వీరు పాల్గొన్నారు. అనంతరం డీ ఓ ఆదిరెడ్డి మాట్లాడుతు సీజన్ ప్రారంభమైనందున ఆయా మండలాల్లో పంటల సాగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గ్రామాలలో దళారుల చేతిలో రైతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి'

కమాన్‌పూర్, జూన్ 25: రైతులు సాగులో రసాయనిక ఎరువుల వాడాకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గుండారం గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ రైతాంగం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు సాగు రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కాంతారావు, ఏవో బండి ప్రమోద్‌కుమార్, వ్యవసాయాధికారులు భూక్యా మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

●పాలకుర్తి, జూన్ 25: పాలకుర్తి మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్సులో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యకంలో ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయశాఖ అధికారి ప్రకాష్, ధర్మారం, అంతర్గాం మండలాల వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యూసుఫ్‌కు అవార్డు

కమాన్‌పూర్, జూన్ 25: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ యూసూఫ్‌ను సామాజిక సేవా విభాగం కింద హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు నారగొని సతీష్, వ్యవస్థాపక అధ్యక్షులు వైద్యుల మధుకర్, అధ్యక్షులు చదువు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్కూరి శంకర్, గుడికందుల భూమయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 26న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ల చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

'బీఆర్ఎస్ హయాంలో ఇసుక దోపిడీ'

మంథని, జూన్ 25: మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఇసుక దోపిడీ జరిగిందని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఈ ప్రాంతానికి చెందిన ఇసుకను హైదరాబాద్‌కు తీసుకెళ్లి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారన్నారు. ఇసుక, మట్టి తవ్వకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని పుట్ట మధు ఆరోపించడం మానేయాలన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ముందు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. దుద్దిళ్ల కుటుంబాన్ని విమర్శించే ముందు తన రాజకీయ ప్రస్థానం ఎక్కడ మొదలైందో గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, కాంగ్రెస్ నాయకులు అక్కపాక సంపత్, ఆర్ల నారాయణ, కాశిపేట బాపు, కుమ్మరి అశోక్‌లు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

-జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్



వికలాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

సుల్తానాబాద్, జూన్ 25: స్వశక్తి మహిళా సంఘాలు తాము తీసుకున్న రుణాల ద్వారా వ్యాపారాలు నిర్వహించి ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్ అన్నారు. డీఆర్‌డీఏ ద్వారా సుల్తానాబాద్‌లో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాన్ని రవీందర్‌రాథోడ్ మంగళవారం సందర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండల సమాఖ్య ద్వారా ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఈ క్యాంటీన్ ద్వారా మహిళా సమాఖ్య ప్రభుత్వ కార్యాలయాలకు, పక్కనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు, ఇతరులకు ఆహార పదార్థాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో మహిళలు ఆదాయాన్ని పెంచుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంటన అడిషనల్ డీఆర్‌డీఓ రవికుమార్, ఏపీఎం శ్రీనివాస్, గీత, దేవేందర్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ధర్మారం, జూన్25: మండలంలోని గ్రామాల్లో నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుష్మిత సూచించారు. మంగళవారం గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మిత మాట్లాడుతూ.. ప్రధానంగా ఇంటి ఆవరణలో ఎలాంటి చెత్తా చెదారం, నీటి నిల్వలు లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ఇందుకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె వివరించారు. అదేవిదంగా గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కోన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలని దీక్ష

ఓదెల, జూన్ 25: మండలంలోని గుంపుల శివారులో నిర్మించిన వైకుంఠ దామాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం గ్రామస్థులు దీక్షను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడే వైకుంఠ ధామాన్ని ధ్వంసం చేయడం వల్ల ప్రజా సొమ్ము రూ.11 లక్షలు వృథా అయ్యిందని, దీనిపై విచారణ చేపట్టి నిందితుల నుంచి ప్రజాసొమ్మును వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, తాళ్లపల్లి వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

ఓదెల, జూన్ 25 : మండలంలోని బాయమ్మపల్లికి చెందిన కాటబట్టి జ్ఞానేశ్వరి మంగళవారం ఐకెపి మండల కార్యాలయానికి 55 కుర్చీలను వితరణ చేశారు. అనంతరం మల్లికార్జున మండల సమైక్య మహిళలు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి జ్ఞానేశ్వరిని సన్మానించారు. ఏపీఎం లతా మంగేశ్వరి, సీసీలు మారెళ్ళ శ్రీనివాస్, వొజ్జె కొమురయ్య, విజయ, అకౌంటెంట్ భవాని, ఆపరేటర్ పవన్ పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు చెట్లే ముఖ్యం

కోల్‌సిటీటౌన్, జూన్ 25: మానవ మనుగడకు చెట్లే ముఖ్యమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి, జయంతి కార్యక్రమాలలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సుల్వ లక్ష్మీనర్సయ్య, మహిళా మోర్చా లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు అపర్ణ, నాయకులు అందె రాజ్‌కుమార్, మెరుగు శ్రీనివాస్, మురళీ, అజయ్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ యజమానిపై ఆర్డీవోకు ఫిర్యాదు

మంథని, జూన్ 24: గంగపురి సత్యసాయి రైస్‌మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులతో కలిసి బాధితుడు గొర్రె రమేష్‌తో కలిసి మంథని ఆర్డీవోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ.. రైస్ మిల్ యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా మంథని బొక్కల వాగులో బోరు వేసి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారన్నారు.బోరు బావికి అక్రమంగా కరెంట్ కనెక్షన్ ఇచ్చి మూడు మూగజీవాల మృతికి కారణమయ్యాడన్నారు. మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గొర్రె రమేష్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్, నాయకులు వేల్పుల సురేష్, బావు రవి, కన్నెబోయిన కిష్టస్వామి తదితరులు ఉన్నారు.

రామగుండంలో పనులను అడ్డుకున్న కాంట్రాక్టర్లు

గోదావరిఖని, జూన్ 25: స్థానిక ఐబీ కాలనీలో సింగరేణి కాలనీలో భూక్య రాజునాయక్ అనే కాంట్రాక్టర్ సీసీరోడ్డు వేస్తుండగా ఆర్జీ-1కు చెందిన పలువురు సింగరేణి కాంట్రాక్టర్లు అడ్డుకుని పనులు నిలిపివేయించారు. శ్రీరాంపూర్‌కు చెందిన రాజునాయక్ ఆర్జీ-1లో రింగ్‌తో సంబంధం లేకుండా టెండర్ వేశాడు. తక్కువ రేటుపై టెండర్ దాఖలు కావడంతో అతనికి టెండర్ వచ్చింది. మంగళవారం సీసీ రోడ్డు పనులు చేస్తుండగా 20మంది ఆర్జీ-1 కాంట్రాక్టర్లు అడ్డుకుని పనిముట్లను లాక్కున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా వన్‌టౌన్ పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

కాలం చెల్లిన వాహనాలు అమ్మేందుకు అనుమతి

కోల్‌సిటీ, జూన్ 25: రామగుండం నగరపాలక సంస్థలో కాలంచెల్లిన వాహనాలను స్క్రాప్ కింద అమ్మేందుకు అనుమతి ఇచ్చినట్టు మోటార్ వెహికిల్‌ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని వెహికిల్ షెడ్లను, పాతవాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మూలనపడిన స్కై లిఫ్టర్, జీప్, 14 ఆటో ట్రాలీలను స్క్రాప్ వేసేందుకు అనుమతి ఇచ్చారు. కాగా కార్పొరేషన్‌లో జీవిత కాలం ముగిసిన 15ట్రాక్టర్లను మరో ఐదేళ్ల పొడగించుకునేందుకు అవకాశం ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆయన వెంట కమిషనర్ శ్రీకాంత్, వెహికిల్ ఇన్‌చార్జి శంకర్‌రావు ఉన్నారు.

ఏసీపీ విచారణ

ముత్తారం జూన్ 25: మండలంలోని పారుపల్లిలో ఈనెల 21న గొట్టేముక్కల సంపత్ రావు తనను కులం పేరుతో దూషించాడని ఇనుముల లక్ష్మయ్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఆయన తెలిపారు. వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధుసూదన్‌రావు ఉన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిటౌన్, జూన్ 25: వర్షాకాలంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్, మెప్మా సిబ్బందితో కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్, మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో, ఇంట్లో ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. త్వరలో హరితహారం కార్యక్రమం నిర్వహిస్తామని మొక్కలు నాటడానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, జూన్ 25: క్రీడా పాఠశాల ప్రవేశం కోసం మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని చెప్యాల రాజకుమారి జిల్లా స్థాయికి ఎంపికైంది. మండల విద్యాశాఖాధికారి టీ సురేందర్ కుమార్, ఎంఎన్ఓ సిరిమల్ల మహేష్, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం నరెడ్ల సునీత ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు పీఈటీలు కుమారస్వామి, దుర్గాప్రసాద్, ఈర్ల నరేష్, నజీమ్‌లు ఆటలపోటీలను నిర్వహించారు. ఇందులో రాజకుమారి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సమత, భారతి విద్యార్థినిని అభినందించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

పెద్దపల్లి రూరల్, జూన్ 25 : పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై గ్రామ మాజీ ఉప సర్పంచ్ చీకటి పోచాలు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోచాలు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని పనులకు చెల్లించే చెక్కుల విషయమై పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.



అదనపు కలెక్టర్ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 25: సింగరేణి సంబంధిత అంశాలపై చర్చించేందుకు మంగళవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ఆర్జీ-2 అధికారులతో సమావేశమయ్యారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూముల సంబంధిత విషయాలు, బొగ్గు ఉత్పత్తిలపై ఈసమావేశంలో చర్చించారు. ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ వివరాలు అదనపు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్జీ-2 ఎస్టేట్ అధికారి సునీత పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన ఐటీ ఔట్ సోర్సింగ్ ఇంజనీర్లు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 25: సింగరేణి ఐటీ విభాగంలో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న సర్వీస్ ఇంజనీర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. గడిచిన 15 ఏళ్ళుగా విధులు నిర్వహిస్తున్న పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు పెంచాలని కాంట్రాక్టు సంస్థకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సింగరేణి యాజమాన్యం సైతం పట్టించులేదని, వేతనాల పెంపుదలపై అడిగిన వారిని విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నట్టు వారు ఆరోపించారు. సంస్థలో ఉత్పత్తి అయిన బొగ్గు రవాణాలో వీరి సేవలు కీలకం. వీరు విధులను బహిష్కరించడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

నేడు ఆర్జీ-3లో పెన్షన్ అదాలత్

రామగిరి, జూన్ 25: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో బుధవారం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి మాజీ ఉద్యోగులకు సంబంధించిన కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ అదాలత్‌ను సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ సమక్షంలో ఈనెల 26న ఉదయం 11 గంటలకు జీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ తెలిపారు. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలను వెల్లడించాలని కోరారు.

గనుల వేలాన్ని రద్దు చేసేలా ఐక్య ఉద్యమాలు : ఐఎన్‌టీయూసీ



సమావేశంలో మాట్లాడతున్న నర్సింహారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 25: బొగ్గు గనుల వేలాన్ని రద్ద చేసేలా ఐక్య పోరాటాలకు ఐఎన్‌టీయూసీ సిద్ధంగా ఉన్నదని యూనియన్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. ఎన్‌డీఏ రెండవ సారి అధికారంలోకి వచ్చాక ఎంఎండీఆర్ యాక్టు అమలులోకి తెచ్చిందని, ఈబిల్లుకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపినట్టు నర్సింహారావు పేర్కొన్నారు. రానున్న 10, 15 ఏళ్ళలో ప్రస్తుత గనుల్లో బొగ్గు నిల్వలు ఖాళీ అయ్యే అవకాశం ఉన్నదని, కొత్త గనులు కేటాయిస్తేనే సింగరేణి మనుగడ ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ళలో ఒక్క గనిని ప్రారంభించలేదని, ఉన్న గనులను మూసివేసినట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సింగరేణికి కొత్త గనులు దక్కేలా కేంద్ర బొగ్గు మంత్రి కిషన్‌రెడ్డి చొరవతీసుకోవాలని లేకుంటే సింగరేణిలో మరో ఉద్యమానికి ఊపిరిలూదినట్టు అవుతుందన్నారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ అక్రం, వడ్డెపల్లి దాస్, కొత్త సత్యనా రాయణరెడ్డి, ఐరెడ్డి సంపత్‌రెడ్డి, లింగమూర్తి, మార్కండేయ, ఆకుల రాజయ్య, కొంగర రవీందర్, ప్యారెమియ, అవినాష్, అనంత రాములు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దు

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జూన్ 25: సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం బహిరంగ వేలంపాటలో పెట్టి ప్రైవేటీకరించే విధానాన్ని కోల్ బెల్ట్ ప్రాంతంలోని సకల జనులు ఖండించాలని, బొగ్గు బ్లాకులను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఢిల్లీ రైతు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కోరారు. తెలంగాణ కోసం చేసిన సకల జనుల సమ్మె పోరాటాన్ని అధిగమించే స్థాయిలో మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. బెల్ట్ ప్రాంత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరూ బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణపై క్రియాశీలంగా స్పందించాలని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరిస్తే ఆ సంస్థకే కాకుండా కార్మికుల హక్కులకు, కోల్‌బెల్ట్ ప్రాంత నిరుద్యోగుల ఉద్యోగ అవకాశాలు కూడా భారీ నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిలో 120 సంవత్సరాలుగా లక్షా 50 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, లక్షలాది మంది జనం పరోక్షంగా జీవనోపాధి పొందుతు న్నారన్నారు. ఇప్పటికే సింగరేణిలో బొగ్గు గనులు తగ్గిపోయి కార్మికుల సంఖ్య 35వేలకు పడిపోయిందని, ఉత్పత్తి మూడింతలు పెరిగిందన్నారు.మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మోదీ కోల్ ఇండియాతో పాటు సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించేందుకు తెరలేపాడన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా కే విశ్వనాథ్

కళ్యాణ్‌నగర్, జూన్ 25: భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన కే విశ్వనాథ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం ఇల్లందులో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వరదయ్య, ఉపాధ్యక్షులుగా వరదయ్య, ఎస్‌కే మదార్, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి కృష్ణ, కోశాధికారిగా లచ్చన్న, సహాయ కార్యదర్శిగా రాంసింగ్, అప్పారావులను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.